# చుక్కాని

"ఎల్లొత్తానే సుక్కా—"

"మావాఁ—" మావొంక సూత్తా అదోలా మొగ వెట్టింది సుక్క.

''ఏటే?''

''నానూ వొత్తాను"

''నువ్వెందుకులేయే'' తోసి పారీసేడు తౌడుగాడు.

'ఎందుకేటి మావా .. అసలే అవిటోడివి. తోడుంటా."

''మరీ అట్టా తీసిపారీకే. ఒంట్లో సత్తువింకా సడిలిపోనేదు. ఇయ్యేల సినేమా పెండీలుకాడికి యాకటేర్లొత్తారంట. ఆ జనం మద్దిల బడి నలిగిపోవూ?"

''అట్టయితే నాను తప్పకుండా రావాల్నే, ఆ జనం మద్దిల ఏటైపోతావో ఏటో—"

''సుక్కా! ఈ కుంటోడి పక్కల సక్కని దానివి నివ్వుంటే... స!... ఏం బాగుంటద్దే. ఒద్దులేయే."

''అదే మాటంటావు మళ్లా. అట్టంటే గుండెల పొడిచినట్టుంటాది. నివ్వెరగవేటి మావా? నీ మనసు సూత్తాగాని, నీ అవిటితనం సూత్తానా? అట్టంటి మాటలనమాకమరి. నన్ను సంపుకుతిన్నట్టే ... ఆఁ... " అన్నాది సుక్క.

"సర్నేయే. ఒత్తానుమరి. ఏలయిపోనాది" సుక్క ఏటి సెప్తాదో మరాలకించకుండా కర్రలు సంకలెట్టుకొని, టకటక లాడించుకుంటా ఎలిపోనాడు తౌడుగాడు, జోలి సంకనెట్టుకుని.

సుక్క ఉస్సురనుకుంటా ఆడు సందుమలుపు తిరిగే దాకా సుత్తావుండిపోనాది దోరబందానికి సేరబడిపోయి. సూపు మరుగైనాక ఏటో దిగులుతో గుండె బరువెక్కినాది. "తల్లీ... నూకాలమ్మ తల్లీ! మావ బారం నీదే." అని మొక్కుకున్నాది రోజూనాగే.

తడికల తలుపు సేరేసుకోబోతూ యెదటి గుడిసెకాసి ఓ పాలి సూసింది. సూసి తుల్లిపడింది.

సెంద్రిగాడు ! జేల్నుంచి ఒచ్చీసేడు !!

గుడ్లగూబనాగ సూత్తన్నాడు. యెదవ నచ్చినాడు. మనువైన ఆడకూతుర్నట్టా సూడ్డానికి సిగ్గునేదు ఎదవకి. ధు! సుక్క ఒల్లు అసెయ్యంతో నిండిపోయింది. గబాల్న ధడేల్మని తలుపేసీసింది. తడి కలూగిపోనాయి, కోపంతో దాని ఒల్లూగిపోతున్నట్టే.

గుబులుతో కూలపడిపోనాది. మావసెప్తే ఇనిపించుకోడే. ఆడి మీద మొగ్గిన మనసు ఆడి సుట్టూరా తిరగతావుంటే, ఆడొచ్చేదాకా ఎట్టా గడుపుద్దో ఆబగమంతునికే తెలియాల. అందులోకీ ఈ యెదవ సచ్చినో డొకడు తన పేణంమీదికి.

మావను సూత్తే సుక్క కడుపు తరుక్కుపోద్ది-మావ! మావంటే మావా! ఎలాగుండీ వోడూ— పయిల్మానులాగా కండలు తిరిగిన దండల్తో—నిన్నమీన కట్టుతో—సూడ్డానికి రెండుకల్లూ సాలీవా?

సుక్కమనసేడకో జారిపోనాది.

* * *

అప్పటికింకా మనువవ్వనేదు.

తౌడుగాడు — సెంద్రిగాడు ...

ఇద్దరికిద్దరే ...

ఆల్లిద్దరయితే తనొక్క_ర్తి.

ఇద్దరికీ తను కావాల.

తనకేవోఁ తొడుమాఁవే కావాల.

అయ్యతో కరారుగా సెప్పేసింది ... తొడుమావనితప్ప మను వాడనని.

అయ్య తనమాట కొట్టీలేదు. కాని సెంద్రిగాడంటే అయ్యకి బయ్యంఁ ''ఆడు మంచోడు కాడే. నలుగురూ ఆడికి సాయంవొత్తారే. సిచ్చ ఎయ్యడానికి యెనకాడ్డాడు" అనీ వోడు అయ్య. సుక్క కదేం పట్టీదికాదు. మనసైన మావతో ఒక్కగడీ కాపరంసేత్తే సాల్దా. ఇద్దరి వూపిరీ ఒక్కపాలి కలిత్తే సాల్దా—అనక సత్తేనేంగాక... అను కుండీది సుక్క.

ఎట్టాగయితేనేవి అయ్యొప్పుకున్నాడు.

ఆయేల... ఆయేల... ఇంకాగేపకవే తనకి. కల్లకింకా కట్టినట్టే వుండాది.

తాటితోపుకాని పుల్లలేరడాని కెళ్ళింది. ఎండాకాలవేమో పొద్దు నెత్తిమీద కొచ్చేతలికి నెత్తిమాడిపోతున్నాది. ఏరేరి అలాగ సెట్టుకింద కూకున్నాది. సెట్టుకవతలేపు ఎవురో కూకున్నారు. ఆడిజోలి నాకేటని కూనిరాగం తీస్తా యేరిన పుల్లలు కట్టకడుతున్నాది.

''ఎహేయ్ సుక్కో! నివ్వటే! ఏటీనూడనట్టుగ ఒచ్చి కూకు న్నావ్?" అంటా సెంద్రిగాడిటేపు జరిగేడు.

''దండ మెట్టమంటావేటి?" కోపంగా నూసింది సుక్క.

''ఓసోస్... మొగుడికి దండమెడితే తప్పేటే?'' గుడ్లగూబ నూపులునూత్తా మరింత జరిగేడు.

"ఏటీ, మాటలు మాజోరుగా ఒత్తున్నాయ్, మొగుడుగిగు డంతన్నావ్... పల్లూడేను జాగర్త."

"నివ్వునాకోసమే పుట్టేవు. తప్పేటిలేయే. ఎవులూనేరుగాని ఒక్కపాలిట్టారాయే..." అంటానే జబ్బొట్టుకున్నాడు.

"ఒగ్గు... ఒగ్గుతావానేదా..." ఇదిలించి కొట్టింది సుక్క. ఆడివి ఇనుపనేతులు. ఎలుగ్గొడ్డుపట్టు. మీదకి లాక్కున్నాడు..."నివ్వు సుక్కవే. సక్కని సుక్కవి. నాను సెందురూణ్ణి. సెంద్రిమావని... ఏటంటావ్'

సెంద్రిగాడు సుక్కేసుకుని ఒచ్చేడని అప్పటికి తెలిసింది. బిక్కనచ్చిపోనాది. బయ్యేవేసింది సుక్కకి. ఏవైనానేత్తే ఏటిదిక్కు? అమ్మో... ఆడికల్లు... ఆసతో సింతనిప్పుల్లా మెరుస్తా... తినీసినట్టు సూస్తున్న ఆడి కల్లు సూస్తే ఒల్లొనికింది.

ఆడి నేతుల్లో ఆడి రొమ్ముమీదకి ఎలిపోతే యీ ఒల్లుని తౌడు మావకి ఎలా ఇస్తాది? ఇవ్వలేదు. "తౌడుమావా!" అని కేకెట్టింది బయంతో.

సటుక్కని ఒగ్గీసేడు సెంద్రిగాడు. లగెత్తబోయింది సుక్క. అటూ ఇటూ సూసేడు సెంద్రిగాడు. ఎక్కడా ఎవ్వలూనేరు. ఎంటబడి తరివి తరివి సుక్క నట్టుకున్నాడు, సిలక వొట్టుకున్న సిడతలాగా.

ఈ పాలి పై పేణాలు పైనేపొయ్యాయి.

"మావోయ్...తౌడుమావా..." అని గావు కే కెట్టింది.

"నాకా డిట్టాంటాటలు సాగవే సుక్కో..." అంటానే సుక్కని పొదలమాటుకి లాక్కెల్తన్నాడు సెంద్రిగాడు.

ఏడనిండొచ్చాడో తౌడుగాడు పొదచాటున కల్లెర్రసేసి సూత్తా వున్నాడు.

తౌడుగాణ్ణి సూడగానే సెంద్రిగాడు గతుక్కుమన్నాడు.

"సెయ్యట్టుకొని ఈడ్సుకెల్లేవరకూ వచ్చిందాయవ్వారం?" అన్నాడు తౌడు.

"నివ్వేవడివెహే—నా యిట్టం."

మెరుపులాగ సుక్కని సెయ్యట్టిలాగీసేడు తౌడుగాడు. సెంద్రిగాడికి కోపంతో ఒల్లు తెలీనేదు. తౌడుగాడి మీదికురికి కింద వాడేసేడు. తౌడుగాడు సింవంలాగే అరిసి లెగిసేడు.

అచ్చు సినేమాయవ్వారంలాగే జరిగిపోనాది. కసింతసేపు అలాగే పడీ పడీమని కొట్టుకున్నారు. తౌడుగాడు సెంద్రిగాడి దవడమీద ఒక్కటి గుద్ది కిందకి పడేసి ఆడిమీద కూకోని— "ఇంకెప్పుడూ యిట్టాటి యెదవ పన్లు సెయ్యమాకు — యెదవా! సుక్క జోలికొత్తే నీ రగతం కల్ల సూత్తా నేటనుకున్నావో ... యేరా... ఒత్తావా? సెప్పరా యెదవ సన్నాసీ సెప్పు ... రానని సెప్పు —" అని సెంద్రి సెప్పేదాకా గుద్దుతానే వున్నాడు.

సుక్క పొంగిపోనాది. ఆడదాన్ని మగోడి నీడలో బతకమని రాసేడు బెమ్మ. ఆ మగోడు తన్ని రచ్చించుకోగల్డని తెలిత్తే, ఆడు కొండలాటోడని తెలిత్తే, ఇంకేటి కావాల. బయ్యేవేటుంది. తౌడు మావనీడన తాను నిబ్బరంగా కాపురం సేత్తాది.

కొట్లాట అయిపోయిందనుకున్నాది సుక్క. కాని దొంగ యెదవ ఎనక మాట్న తౌడు మావ కాలట్టుకుని లాగీసేడు. మావ పల్లంలోకి దొర్లి పోతావుంటే పెద్దరాయి ఎత్తి మావ కాలుమీద ఎత్తీసేడు.

సుక్క కెవ్వుమంది.

* * *

సుక్క నిజంగానే అరిశేసింది. తీరాసూత్తే పొయ్యి ముందల కూకోని వున్నాది. కాని తలుసుకున్న దానికింకా గుండెలు దడదడా కొట్టుకుంటానే వున్నాయి.

కాకి వాలితే తోలేసి మల్లా దిగాలుగా కూకుండి పోనాది.

సెంద్రిగాడు జేలుకెల్లేడు.

జేలు కెల్తేయేటి వల్లకాటి కెల్తేయేటి? మావకాలొత్తాదా? రాదు రాలేదు. మావ కాలు తీసీసేరు.

తనకల సెరిపేద్దా రనుకున్నారంతా. అవిటోడితో పెళ్ళేటన్నారు. కూడెట్టగల్డా — గుడ్డెట్టగల్డా — అన్నారు. నీకే బారం సుమా అని గోలెట్టేరు

మాఁవే అన్నాడు..." నన్నెందుకు పెల్లాడతానంటావే సుక్కా! అట్టాంటి ఆసలెట్టుకోకే. కుంటోడితో కాపరం సెయ్యలేవు. పనీపాటా నేసు కోలేనోణ్ణి. కట్టుకునేటి సుకబడతావు? నేనడుక్కోని బతకాలే...అడు క్కోని బతకాలి. ఈ ఎదవ బతుకంతే..."

సుక్క బోరుమనేడిసింది. "మావా! అట్టాగనమాక మావా! నీ మనసు కావాలగాని కాలూసెయ్యిలో నేటున్నాది? నివ్వు కుంటోడివయితే నీమనసు కుంటిదవుద్దా? నాకోనమే నివ్వు కాలు పోగొట్టుకున్నావు నిన్నిడిసిపెట్టి మరొకణ్ణి మనువాడితే బగమంతు డూరుకోడుమావా మనువు జరగాల్సింది కట్టెలకాదుమావా మనసులకి. మనకెప్పుడో మనువు అయిపోనాది. సెప్పుమావా .. సుక్కని లాగా దారిసూపించడానికి నాన్నికొద్దా ... సెప్పుమావా ... ఒద్దంటే నాను సచ్చిపోతాను మావా..."

తొడుగాడట్టానే వుండిపోనాడు. మనిషి మనసంతెత్తు కూడా ఉంటాదని అప్పుడే గావోసాడికి ఎరికనపడింది.

"నివ్వు దేవతవే. నానెంత పున్నెం సేసుకున్నానో..." అని ఆయేళ్టి కాణ్ణుండీ దేవతలాగే సూత్తన్నాడు తౌడుగాడు.

కాని ఏటినాబం? తనమాట ఒక్కాడమట్టు కినడు-తోడుగా కట్టమైనా సుకమైనా పెళ్లాం పెనివిటితో పంచుకోవాల. మావ ఎంటే తాను వుండాల. అదీ తనాస. కాని మావంటాడు.— "కుంటాడి పక్కన సక్కని దానివి నివ్వుంటే...స! ఏంబాగుంటద్దే అని."

ఆమాటే సుక్క సెవులో గింగురు మంటావుంది. ఎట్టాగ తౌడు మావకి సెప్పడం? ఎట్టాగ సెప్తే ఇంటాడు?

వుట్టికేదో తగిలి తుల్లిపడింది సుక్క. రాయి కిందబడితే కిటికీలబడి సూసింది. ఆయెదవ కల్లు మిటకరిత్తా సూత్తన్నాడు. యెకిలిగా నవ్వేడు. కన్ను గీసేడు. పెదివలు కరుసుకున్నాడు. ఒంటిమీద జెఱ్ఱిగొడ్డు పాకినట్టు గయ్యింది. 'సీ! యెదవజనమ. ఆడకూతురిగా పుట్టడం తప్పా! సక్కగా వుంటే అదీ తన తప్పేనా? ఈ మొకం... ఈ కల్లూ...'

సుక్కకేదో తట్టింది.

పొయ్యి ముందుకెల్లి మంటెట్టింది.

* * *

"అమ్మా" అని అరత్తా పడిపోనాది సుక్క. నిటంలో జరిగిపోనాది- కిటికీలబడి సూత్తావున్న సెంద్రిగాడు లగెత్తు కొచ్చేడు. వచ్చేతలికంతా అయిపోనాది.

సుక్క బాధతో గిలగిల తన్నుకుంటున్నాది. ఆబాధ సెంద్రిగాడిలాటోడేసూడలేకపోయేడు. "ఎంతపని సేసేవే సుక్కా... అట్టా ఎందుకు సేసేవే...?"

"అబ్బా...మరేటి సేసేదిరా సెంద్రిగా. ఈ మొకాన్నేకదరా నివ్వు సూత్తన్నావు. ఈసక్కదనవే మావఎంట ఉణ్ణీకుండా సేత్తున్నాది. సెప్పు.

ఇప్పుడు సూడగలవా నా మొకంలోకి? ఇప్పుడు సూడగలవా నా కళ్ల ల్లోకి...అబ్బా..."

"యెదవనే ... నా నెదవనే... నన్నేం సేసినా పాపంనేదే..." అంటూ సెంద్రిగాడు గబగబ ఆస్పత్రికి ఒట్టుకెళ్లేడు సుక్కని. తౌడు గాడు పొద్దుపోనాక గుడిసెకొచ్చీతలికి, ఎవులూ లేరు సెంద్రి ఒచ్చి సెప్పాడు. తౌడుగాడు బోరుమన్నాడు.

పొద్దుటే తౌడుగాణ్ణి ఆస్పత్రికి ఒట్టు కెళ్లేడు సెంద్రి "ఏటే సుక్కా...ఎంతపని సేసేవే" అంటూ లబోదిబోమన్నాడు తౌడుగాడు.

"నానే సేసినా౯నా తౌడుగా, నా కేసిచ్చేసినా.. కాకులకీ గెద్దలకీ ఏసినా పాపంనేదురా..." అన్నాడు సెంద్రిగాడు ఏడుస్తా.

"ఎవులూ ఏటి సెయ్యనేదు మావా...నానే సేసుకున్నాను. ఇయ్యేట్టి కాణ్ణుండీఎవులికల్లూ నామీనుండవు. నా పెనివిటికల్లు నామీనుంటే సాలు. నా పెనివిటి సల్లగా సూత్తేసాలు మావా! పెనివిటితోనే పెల్లాం వుండాలకదా... అందుకే ఇట్టా సేసినాను నాను సెప్తే ఇనుకోవు. నాకిప్పు డాయిగా వున్నాది. ఇంక నాను సక్కని సుక్కని కాదుమావా. సెప్పు మావా ...నీతో నన్నుకూడా ఒట్టు కెల్తావా... సెప్పు మావా...యీగుడ్డి దాన్ని ఒగ్గేత్తావా?"

తౌడుగాడికడుపు దేవినట్టు గయ్యింది.

"అట్టాంటి మాటలనమాకే...నివ్వు దేవతవేసుక్కా...అట్టాంటి నిన్ను ఒగ్గేత్తానే! నన్ను కుంటోణ్ణిని ఒగ్గిసేవా? నీకు కల్లు నేకపోతే నేటి...సుక్కానిలాగా దారి సూపించడానికి నానున్నానే సుక్కా..."

సుక్క ఇస్సురన్నాది.

* * *

ఆస్పత్రిలో నుండి ఒచ్చినింది సుక్క.

రెండూకల్లూనేవు. మొకాన సక్కదనంనేదు. అయితేనేం మనసు మట్టుకు సెదిరి పోకుండా వున్నాది.

ఆయేట్టి నుండి సినేమా పెండీలుకాడ ఒక గొంతుక్కాదు; రెండు గొంతుకలు ఆరుత్తున్నాయి,

"నడవకాల్లూలేవు నారాయణా!

సూడకల్లూలేవు నారాయణా!"

(పొలికేక)